# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ శాంతి భద్రతలు కాపాడటంలో పోలీసుల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ శ్రీకాకుళం జిల్లా మూలపేట ఓడరేవు నిర్మాణ పనులను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు పునఃప్రారంభించారు.
- ❖ గుర్ల గ్రామంలో అతిసార వ్యాప్తికి గల కారణాలను విచారించడానికి సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.
- ❖ తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రేపటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================

మారుతున్న నేరాల తీరుపై పోలీసులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రోజు విజయవాడలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... శాంతి భద్రతలు కాపాడటంలో పోలీసుల పాత్ర కీలకమని, సవాళ్లను ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన పోలీసు వ్యవస్థకు శ్రీకారం చుట్టామన్నారు. విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు. అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులను అభినందిస్తున్నానని చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

======================

విజయనగరం జిల్లాలో ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈ రోజు పర్యటించారు. నెల్లిమర్ల మండలం ఎస్.ఎస్.ఆర్.పేట వద్ద తాగునీటి పథకాన్ని ఆయన ముందుగా పరిశీలించారు. గుర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించారు. ఆ గ్రామస్తులతో తాగు నీటి సరఫరా వివరాలను తెలుసుకున్నారు. అతిసారం వ్యాప్తి కారణాలపై కలెక్టర్‌తో సమీక్షించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... గుర్ల

గ్రామంలో అతిసార వ్యాప్తికి గల కారణాలను  విచారించడానికి సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించామని తెలిపారు. విచారణ తర్వాత ప్రభుత్వం నుంచి పరిహారం ప్రకటిస్తామని ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=======================

శ్రీకాకుళం జిల్లా మూలపేట ఓడరేవును పూర్తి చేసి ఆ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తీరుస్తామని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ రోజు మూలపేట పోర్ట్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డితో కలసి మంత్రి పున:ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... 2025 జున్ 12 నాటికి ఒక బెర్త్ పూర్తి చేసి పోర్టును ప్రారంభిస్తామని మంత్రి తెలియజేశారు.

విరామం

=======================

కేంద్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహిస్తున్న గృహ నిర్మాణ పథకంలో నకిలీ లబ్ధిదారులను గుర్తించేందుకు ఉపయోగపడే "ఆవాస్" యాప్ కి సంబంధించి ఈరోజు గుంటూరు నగరంలో 5 రాష్ట్రాల అధికారులకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...  దేశవ్యాప్తంగా నమోదైన 2 కోట్ల నూతన గృహాలకు సరైన లబ్దిదారులను పారదర్శకంగా ఎంపిక చేయటానికి ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.  దీనితో పాటు పెండింగ్ లో ఉన్న గృహాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు.

=======================

గిరిజనులకు ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులను గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో ఈ రోజు అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... హాస్టల్లో విద్యార్థులు తినడానికి కంచాలు, పడుకోడానికి దుప్పట్లు వంటి ప్రాథమిక సౌకర్యాలను కల్పించాలని, అనారోగ్యానికి గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్య, వైద్యం, రహదారులు వంటి కనీస సౌకర్యాలు గిరిజనులకు అందేలా చూడాలని ఆమె అధికారులకు స్పష్టం చేశారు.

=======================

తూర్పు మధ్య బంగాళాఖాతం, ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రేపటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 23 తేదీన ఇది తుఫానుగా మారుతుందని ఆ తర్వాత 24వ తేదీ నాటికి ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకుంటుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ లో రేపు తేలికపాటి  నుండి ఒక మోస్తరు  వర్షాలు  లేదా  ఉరుములతో  కూడిన  జల్లులు కొన్ని చోట్ల  కురిసే  అవకాశముందని వాతావరణ శాఖ తెలియజేసింది.

=======================

ఉత్తరాంధ్రలో తుఫాను నేపథ్యంలో ఈ నెల 23 నుండి 26వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, కావున అందరూ అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక జిల్లా అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ... అధికారులు ప్రధాన కేంద్రంలోనే అందుబాటులో ఉండాలని, ఎవరికీ ఎటువంటి సెలవులు మంజూరు కాబడవని ఆమె స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ అనుమతితో మాత్రమే ప్రధాన కేంద్రం విడిచివెళ్లాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రెవిన్యూ, నీటి పారుదల,

గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యం, పంచాయతీ, డ్వామా, వ్యవసాయ అనుబంధ శాఖలు, పోలీస్ తదితర శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

=======================

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్ రోడ్ లో అమరవీరుల స్థూపం వద్ద వారి స్మృతికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరింధ్ర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్ లు పాల్గొన్నారు. మరింత సమాచారాన్ని మా విశాఖపట్నం ఆకాశవాణి ప్రతినిధి వి. సత్యనారాయణ మూర్తి అందిస్తారు.

(వాయిస్ 38 సెకన్లు)

=======================

తల్లిదండ్రుల పోషణ భాద్యత వారి పిల్లలదేనని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఈ రోజు కలెక్టరు కార్యాలయంలో వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం-2007 గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు.

=======================

=======================